# చదువు

– గంట నరేంద్ర రెడ్డి

"గంగీ!" భర్త నోటి నుండి వచ్చిన భయంకరమయిన పిలుపుకు అదిరి పడింది గంగి. ఆమె కళ్ళల్లో భయం తొణికిసలాడింది. కాళ్ళూ చేతులూ వణికాయి. గుండెలో చెలరేగే ఉద్వేగాన్ని అణుచుకుంటూ వడివడిగా భర్త చెంత చేరింది. ఆమె వైపు క్రోధంగా చూశాయి సోములు కళ్ళు. పళ్ళు పటపట మన్నాయి. పిడికిలి బిగుసుకుంది. కాని ఏదో ప్రేమ ఆ క్రోధాగ్నిని చల్లార్చింది. తల క్రిందికి వేసుకుని నిలుచున్న గంగిని చూడలేక పోయాడు సోములు.

"ఆ డబ్బెంతున్న తీశావే?" కాస్త కటువుగానే అన్నాడతడు.

ఏం చెప్పాలో తెలియక అలాగే నిలుచుండి పోయింది గంగి.

"ఏమే! ఈసారి ఇంకాస్త కరుకుగా వచ్చింది మాట.

కళ్ళు భయంతో వణికిపోయి, గొంతు సవరించుకుని, "బియ్యం కొన్నాను" అంది గంగి. సోములికి ఒళ్ళు మండిపోయింది.

"బియ్యం బియ్యం! అస్తమానం అదే మాట. రోజూ కాళ్ళూ చేతులూ నాశనం చేసుకుని నాలుగు పైసలు సంపాదించేది నా కడుపు కోసమటే? మాయదారి తిండి లేకుంటే పోయె ఇంత గంజి అడుక్కొనయినా బతకాలికానీ, నా బిడ్డడు.. నా రంగడు డాటరు కావాల్న వాడి చదువులకోసం ఇలా డబ్బు కూడబెడుతుంటే నువ్వేమో బియ్యానికనీ, కూరకనీ, ఉప్పుకనీ రోజూ డబ్బు తగలెడుతుంటే ఆడి నెట్టా సదివించాల? ఒసే గంగీ! మన కడుపులు మాడ్చుకొనియయినా సరే ఆడికి మాత్రం డబ్బు ఎక్కగా పట్టాలి. తెల్సిందా?"

ఆయాసంగా ఆగిపోయాడు సోములు. గుండెను నిప్పులాంటి విషయమొకటి దహిస్తుంటే గంగి కళ్ళు చెమ్మగిల్లాయి. అరికాలి బొటనవ్రేలుతో నేల రాస్తూండిపోయింది.

"సూడు, పొద్దెక్కిపోతున్నది! ఇన్ని మంచినీళ్ళియ్యి! పనికిపోవాలి" అన్నాడు సోములు. వంటింట్లోకి వెళ్ళింది గంగి.

"అమ్మా! నాకీ రోజైనా డబ్బిస్తావా? ఫీజు కట్టేందుకు ఈ రోజే ఆఖరి రోజు" చిర్రుబుర్రుమన్నాడు రంగరాజు.

"ఏంటావుతే? ఆడిప్పుడు డబ్బు కావాలంటున్నాడు! నానిప్పుడేం జేసేది?" దిగులుగా, భార్య వైపు చూస్తూ అన్నాడు సోములు.

"అదేమిటి? డబ్బులేదా? మరిప్పుడెలా?" అన్నాడు రంగరాజు.

"నువ్వడిగినంత డబ్బులేదు బాబూ! ఇది డబ్బు రోజూ కాజెయ్యకుంటే మొత్తం ఇచ్చేవాడిని" భార్యవైపు కోపంగా చూసి అన్నాడు సోములు. రంగరాజు కాస్త ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

"సరే! ఆ ఉన్నదబ్బయినా ఇవ్వు! మిగతా డబ్బెవరినైనా అప్పుగా అడిగి ఇచ్చేస్తాను" అన్నాడు రంగరాజు. సోములు డబ్బందించాడు.

"ఒరే రంగా! రోజూ ఇక్కడ్నుంచి ఆ ఊరికెళ్ళే సరికి కాళ్ళు నొప్పులు పుట్టడం లేదూ?" జాలిగా అన్నాడు సోములు.

"మరేం చేయాలి? అది నా ఖర్మ, సరే

మైమయింది వెళ్ళొస్తాను" డబ్బు జేబులో కుక్కుకుని బయటికి నడిచాడు రంగరాజు. అటు వైపే చూస్తూ పెద్దగా నిట్టూర్చాడు సోములు. అల్లంత దూరంలో ఉన్న గంగి కాస్తా ఏదో విషయం చెప్పడాని కన్నట్లు సోములి దగ్గర కొచ్చింది.

"సీతకి ఏళ్ళు దాటి పోతున్నాయి. దానికా మూడు ముళ్ళూ పడేసే...." గంగి మాట పూర్తికాకముందె సోములు, "అబ్బబ్బా! అస్తమానం సీతా, దాని పెళ్ళి అంటూ నా పేణం తోడెయ్యకే! ఒసే గంగీ .... ముందు మన గంగడు డాటరు గానియ్యవే! తరువాత అడే దాని పెళ్ళి జేత్తాడు. నీకువాడి సదువు మీదే ఏడు పెందుకే? .... అసలు సదువంటే ఏటను కున్నావే? అది మను సుల్ని తీర్చి దిద్దు తుందే! మన రంగడు డాటరవుతాడే! అదే మన పేరునూ, మన వంశం పేరునూ నిలుపుతాడే! నువ్వు నోరు మూసుకుని కూకో!" అన్నాడు సోములు. గుండెను దహించి వేస్తున్న నిజాన్ని చెప్పి వెచ్చుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్న గంగి లోలోన వణవలా ఏడ్చేసింది. కాని భర్త ముందు నోరు విప్పలేదు.

*

ఆరోజే రంగరాజు చదివే ఊరికే పనికి వెళ్ళిన సోములు పని ముగించుకుని తిరుగు ముఖం పట్టాడు. ఊరి చివర పార్కు కనిపించే సరికి కాస్త సేద తీర్చుకుందామను కుని ఆ వైపు నడిచాడు.

పార్కులోకి అడుగెట్టబోయిన సోములికి లోపల పచ్చిక మీద కూర్చుని ఉన్న విద్యార్థుల గుంపు కన్పించే సరికి వాళ్ళలో రంగరాజు కూడా ఉన్నాడు.

"ఒరే రంగరాజు! మనందరిలోకెల్లా నీవే ధనికుడిలాగున్నావు! చక్కని బట్టలు, ఎప్పుడూ జేబునిండా డబ్బు, సినిమాలు, షికార్లు, విలాసాలు చదువుకు ఎగనామం. నీదిరా రాజా బ్రతుకు" ఒక డన్నాడు.

"అబ్బే! నేనేం ధనవంతుణ్ని కానురా! మా నాయన పట్టి అమాయకుడురా! నేనేమో పెద్ద చదువులు చదివి అందర్నీ ఉద్ధరిస్తానని, ఇంకా ఏవేవో పిచ్చి కలలు కంటాడు. ఆ పిచ్చితోనే అస్తమానం ఒళ్ళుపంచి చాకిరి చేసి డబ్బు సంపాదిస్తాడు నా కోసం. నేనేమో ఆ డబ్బు చక్కా ఖర్చేస్తూ, మా అమ్మ నోరు మూయిస్తాను! ఈ విషయం మా నాన్నతో చెప్తే నన్ను తంతాడేమోననే దిగులూ, భయంతో మా అమ్మ ఆ నిజాన్ని కప్పివేస్తుంది. బియ్యానికో దేనికో డబ్బు తీశానని అబద్ధమాడుతుంది! ఇక్కడ మన జల్సా ఇది!" అన్నాడు రంగరాజు.

అందరూ నవ్వారు. బలే అసాధ్యుడను కున్నారు. వారెవరూ సోములిని గమనించ లేదు. కొడుకు మాటల్ని విన్న సోములి శరీరం నిలువెల్లా కంపించింది. కళ్ళల్లో కోపాగ్ని జ్వాలలు రగుల్కొన్నాయి పళ్ళు పట పట లాడినాయి. అంతు తెలియని ఆవేశం పిచ్చివాడిని జేసింది. కళ్ళముందు కోర్కెలకు సంకెళ్ళు తగిలినట్టూ, ఆశల, ఆశయాల సౌధాలు బ్రద్దలయినట్టూ తోచింది. తల తిరిగినట్లయింది. ఒక్కసారి గట్టిగా "రంగా!" అని అరుస్తూ కుప్పకూలి పోయాడు

